క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ఆత్మకూర్: మండలంలోని ఆరేపల్లి బస్టాండ్ కూడలిలో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నరేష్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటన్న, వేణు, బాలకృష్ణ, అశోక్, శ్రీను, అంజి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆత్మకూర్: పట్టణానికి చెందిన డీసీఎం డ్రైవర్ సీతాపతి బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న తోటి డ్రైవర్లు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రూ.45 వేలు నగదును అందజేసి మేమున్నామంటూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీసీఎంల యజమానులు గోపి, వెంకటేష్, శ్రీనివాసులు, నీలేష్, డ్రైవర్లు మహబూబ్‌అలీ, అర్షద్, నవీన్, వెంకటేష్, వెంకటన్న తదితరులు ఉన్నారు.

సందెపురాళ్ల పోటీలు



గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సందెపురాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.4,016లు గీరప్పగాళ్ల హనుమంతు గెలుపొందాడు. ద్వితీయ బహుమతి రూ.3,016లు నర్సింహ, తృతీయ బహుమతి రూ.2,016లు జగదీష్, తిమ్మప్పలు, నాలుగో బహుమతి రూ.1,016లు హనుమంతు దక్కించుకున్నారు. పోటీల్లో పాల్గొన్న మరో 8 మందికి ప్రోత్సాహక బహుమతిగా ఒక్కొక్కరికి రూ.500లు అందజేశారు. విజేతలకు బీఆర్ఎస్ నాయకుడు బాసు గోపాల్‌నాయుడు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బసప్ప, బత్తులయ్య, నర్సప్ప, ముక్కెరయ్య, బాసు నర్సింహ, గుడిసె వీరేష్, పోతులరాజు, హనుమంతు, రామకృష్ణ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ధన్వాడ: మండల కేంద్రం శివారులో ఉన్న భరత గడ్డపై వెలసిన వేంకటేశ్వరస్వామికి శివరాత్రి సందర్భంగా యువకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపైకి వెళ్లేందుకు సరైన దారిలేక దూప దీప నైవేద్యానికి స్వామి వారు నోటుకోవడం లేదని హిందువాహిని జిల్లా సంయోజక్ సుదర్శన్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం స్పందించి దేవాలయానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి రాజు, కురుమూర్తి యాదవ్, తిరుమలేష్‌గౌడ్, సతీష్, బాలరాజు పాల్గొన్నారు.

వీరసావర్కర్‌కు నివాళి



నారాయణపేట టౌన్: వినాయక్ దామోదర్ వీరసావర్కర్ వర్ధంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, బీజేపీ నాయకులు పట్టణంలోని సావర్కర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షులు డా.రాంబాబు మాట్లాడుతూ.. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, స్వాతంత్య్ర ఉద్యమంలో ఎందరికో ఆదర్శంగా నిలిచి ధైర్యశాలి వీరసావర్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యా యాదవ్, వీహెచ్‌పీ నాయకులు ప్రవీణ్, పలువురు భజరంగ్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం పరిశీలన

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో హైస్కూల్‌లో ఉన్న క్రీడా మైదానాన్ని బుధవారం అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు, కొండూరు మాజీ సర్పంచ్, నల్లపోతుల గోపాల్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో భవిష్యత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల నిర్వహణ కోసం జిల్లా అసోసియేషన్ నుంచి ఆ పాఠశాలను సందర్శించారు. పోటీల నిర్వహణకు మౌలిక వసతులు, సదుపాయాల గురించి ఆరా తీశారు. గ్రామంలోని నాయకులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నల్లపోతు గోపాల్, కుమారస్వామి, సురేష్, మోహన్ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం వద్ద..



చిట్యాల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



తెల్లరాళ్లపల్లిలో శివాలయంలో శివపార్వతుల కల్యాణం

నీలకంఠాయ.. నమోస్తుతే

సాక్షి, నెట్‌వర్క్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లావ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి స్వామి వారిని భక్తితో కొలిచారు. రాత్రి సమయంలో ఆలయాల్లో అఖండ భజనలు చేస్తూ జాగారం చేశారు.

✦ ఆత్మకూర్ పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి, చెర్లపరమేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక షిర్డిసాయిబాబా ఆలయం, వేంకటేశ్వరస్వామి, రాఘవేంద్రస్వామి, కన్యకాపరమేశ్వరి, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పరమేశ్వర స్వామి చెరువు మధ్యలో ఉన్న శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. పీజేపీ క్యాంప్‌లోని భ్రమరాంబిక మల్లికార్జున ఆలయం, బీసీ కాలనీలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



ఆత్మకూర్‌లో..

✦ కొత్తకోట సమీపంలోని కానాయపల్లి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శివలింగానికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. పామాపురం సమీపంలో గల రామేశ్వర స్వామి ఆలయానికి, పట్టణ సమీపంలో గల బ్రహ్మంగారి ఆలయంలో గల శివుడి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

✦ పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి, రేమద్దుల, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, గోప్లాపూర్, శాగాపూర్, మాందాపూర్, అన్నారం, చిక్కేపల్లి, కొత్తపేట గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తెల్లరాళ్లపల్లి శివాలయంలో శివపార్వతుల కల్యాణం జరిపించారు. పోతులమడుగు సీతారామంజనేయ ఆశ్రమ పీఠాధిపతి తిరుపతి తీర్థానందస్వామి ఆశీస్సులచే ఆశ్రమ ఉత్తర పీఠాధిపతి వెంకట్ చరణ్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవ, ధ్యానం, పంచామృతాలతో స్వామి వారికి రుద్రాభిషేకం, రుద్రహోమం, మహాపడిపూజ , శివపార్వతుల ఊరేగింపు నిర్వహించారు.

✦ ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన వీరభద్రస్వామి దేవాలయం, మామిడిమాడ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పర్వతాపురం, గట్టుకాడిపల్లి లక్ష్మీఅలవేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, అప్పారెడ్డిపల్లి పెద్దవాగు సమీపంలోని శివాలయం, సోళీపురం లక్ష్మీనర్సింహ యోగానంద స్వామి ఆలయం, ఖిల్లాఘనపురం కుర్వగేరి శివాలయం తదితర ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. రాత్రి 7:30 గంటల సమయంలో ఖిల్లాఘనపురం వెంకయ్య గుట్టపై పెద్ద దీపం వెలిగించిన వెంటనే భక్తులు కుర్వగేరి శివాలయం వద్ద దీపాలు వెలిగించారు.

✦ గోపాల్‌పేట మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం, బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో కేశంపేట వేణుగోపాల స్వామి ఆలయం, చెన్నారం, రేవల్లి మండలంలోని ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

✦ అమరచింత మండలంలోని చంద్రగఢ్ కోటపై వెలసిన రామలింగేశ్వర ఆలయంలో భక్తులు అభిషేకాలతో పూజలను నిర్వహించారు. పట్టణంలోని పాత శివాలయంతో పాటు శ్రీకృష్ణనగర్‌లో వెలసిన శివాలయంలో భక్తుల పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

✦ వనపర్తి మండలంలోని చిట్యాల, అంకూరు, రాజపేట, చిమనగుంటపల్లి, పెద్దగూడెం, చందాపురం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఖిల్లాఘనపురంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పాన్‌గల్ శివాలయంలో..



బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో..



అమరచింత శివాలయంలో..



ఆత్మకూర్‌లోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో..



పామాపురంలో..



ఈర్లదిన్నెలో..

క్రీడలతో మానసికోల్లాసం

పాన్‌గల్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్‌ఐ శ్రీనివాసులు, వ్యాపారవేత్త పీట్ల కతాల్ అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దులలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోటీల నిర్వహణతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పోటీలను నిర్వహిస్తున్న యూత్ సభ్యులను వారు అభినందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 32 టీంలు పాల్గొనగా.. మ్యాచ్‌లు మ్యాట్‌పై నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. విజేత జట్టుకు పీట్ల కతాల్ రూ.50 వేలు నగదు, ద్వితీయ బహుమతి రెడ్డి సేవాసమితి వారు రూ.30 వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, మధుసూదన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, తిరుపతయ్య, ప్రసాద్‌రావు, బక్కిరెడ్డి, వివేకానందయూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన బండారు వీరస్వామి 23వ తేదీన గ్రామం నుంచి శ్రీశైలానికి పాదయాత్రతో వెళ్తున్న వీపనగండ్ల, చిన్నదగడ శివ మాలధారులతో కలిసి వెళ్లాడు. మాలధారులు శ్రీశైల దర్శనం చేసుకొని గ్రామాలకు చేరుకున్నారని, కానీ వీరస్వామి ఇంటికి తిరిగి రాలేదని అతడి తండ్రి, తమ్ముడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

మదనాపురం: మండలంలో గురువారం ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి పర్యటన కొనసాగుతుందని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ తెలిపారు. గోవిందహళ్లి, దంతనూరు, తిరుమలయ్యపల్లి, మదనాపురం, నెల్విడి, కొన్నూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆయా గ్రామాల ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

క్షయ నిర్ధారణకు ప్రత్యేక శిబిరాలు

వీపనగండ్ల: టీబీ వ్యాధితో పాటు ఛాతి సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం గురువారం కల్వరాల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. దగ్గుతో కూడిన తెమడ, రక్తం పడడం, జ్వరం, ఛాతి నొప్పి, షుగర్ వ్యాధి ఉన్నవారు ఈ క్యాంపులో పాల్గొని అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రత్యేక మొబైల్ టీం వైద్యుల ద్వారా క్యాంపు నిర్వహిస్తామని, అవకాశాన్ని ఇరు గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న డ్రెయినేజీ స్లాబ్ నిర్మాణాలు

అమరచింత: పట్టణంలోని పలు వార్డుల్లో ప్రధాన మురుగుకాల్వపై స్లాబ్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలో మున్సిపాలిటీ ద్వారా రూ.3 లక్షలతో 6 స్లాబ్‌ల నిర్మాణ పనులు చేపట్టారు. 15 రోజుల నుంచి 8, 9, 6 వార్డుల్లో ప్రజల అవసరాల మేరకు మురుగు కాల్వపై నూతనంగా స్లాబ్‌లను నిర్మిస్తున్నట్లు కమిషనర్ రవిబాబు తెలిపారు. గతంలో మురుగు కాల్వ నిర్మాణ సమయంలో స్లాబ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో కాల్వలోని మురుగు ముందుకు వెళ్లకుండా శిథిల స్లాబ్‌ల వద్ద నిలిచిపోతుంది. దీంతో మురుగు నీరు రహదారిపై వస్తుందని ఆయా వార్డుల ప్రజలు విన్నవించడంతో నూతన స్లాబ్‌ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు.



శివాలయం వద్ద మురుగుకాల్వపై స్లాబ్ ఏర్పాటు పనులు

‘దుండగులను గుర్తించాలి’

మరికల్: మండల కేంద్రంలోని పెద్దచెరువు కట్టమైసమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు హరీష్, వెంకటేష్‌గౌడ్, నర్సింహులు, కొండప్ప అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మరికల్‌లో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని, అమ్మవారి విగ్రహం ధ్వంసం చేయడం వెనక ఎవరి కుట్ర ఉందో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి నిఘా పెట్టాలని సూచించారు.

డీసీఎం ఢీకొని ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

అమరచింత: ఎండు మిర్చి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన ఘటన అమరచింత పట్టణ శివారులో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన రాజేష్ అనే రైతు తాను పండించిన మిర్చి పంటను మార్కెట్‌లో విక్రయించేందుకు డీసీఎంను కిరాయికి తీసుకొచ్చాడు. మంగళవారం రాత్రి డీసీఎంలో మిర్చిని లోడ్ చేసి మార్కెట్‌కు తరలిస్తుండగా.. పంటపొలంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని గమనించి సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి ఎల్‌సీ తీసుకుందామనుకున్నాడు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి సబ్‌స్టేషన్‌లో ఉన్న ఆపరేటర్ మద్దూర్ శ్రీనుకు ఫోన్‌చేసి ఎల్‌సీ ఇచ్చి కరెంట్ సరఫరా కాసేపు ఆలపాలని రైతు కోరాడు. ఎల్‌సీ ఇచ్చామని ఆపరేటర్ చెప్పడంతో డీసీఎంను పంట పొలం నుండి రోడ్డుపైకి తీసుకొచ్చే క్రమంలో క్యామ రాములు పంట పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీసీఎం బలంగా ఢీకొట్టింది. దీంతో అక్కడే ఉన్న సిమెంట్ స్తంభాలు విరిగి పడటంతో పాటు మరో మూడు ఇనుప విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని విద్యుత్ సిబ్బంది తెలిపారు. సమయానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సబ్‌స్టేషన్‌లో ఉన్న ఆపరేటర్ సంబంధిత లైన్‌మెన్ పర్మిషన్ తీసుకోకుండా అడ్డగోలుగా ఎల్‌సీలు ఇవ్వడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

‘ప్రత్యేక పాలన’లో అవస్థలు

- సమస్యలు తలెత్తితే వారాల పాటు ఎదురుచూపులు
- ప్రతి గ్రామంలో వీధిలైట్లు, తాగునీరు, దోమల సమస్య

గోపాల్‌పేట: ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాప్రతినిధుల పాలన ముగిసి ఇప్పటికి పద్నాలుగు నెలలు గడిచిపోయింది. ఇంకా కొంతకాలం పాటు అధికారుల పాలనే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. గ్రామాల్లో కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో కొత్తగా ఏర్పాటు అయిన ఏదుల మండలంతో కలిపి మొత్తం 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో బండరావిపాకుల, కొండలపల్లి గ్రామాలు మునకకు గురికావడంతో ఆర్‌అండ్‌అర్ సెంటర్లలో పనులు కొనసాగుతున్నాయి. ఇంకా పూర్తిస్థాయిలో పనులు కాలేదు. మిగతా 32 గ్రామాల్లో తాగునీరు రెండు రోజులకోసారి వస్తున్నాయి. గ్రామాల్లో వీధిలైట్లు చాలావరకు వెలగడం లేదు.

ఇదీ పరిస్థితి

గోపాల్‌పేట మండల కేంద్రంలోని రాంగన్‌కాలనీలో చాలారోజులుగా మిషన్ భగీరథ నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంప్‌హౌస్ నుంచి వచ్చే నీటిలో బోరునీరు కలుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇదే కాలనీలో ముప్పైకి పైగా వీధిలైట్లు వెలగడం లేదు. అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. ఏడుట్ల మతం కాలనీలో తాగునీటి ట్యాంకు పైకప్పు కూలిపోయి సీకులు తేలాయి. ఎప్పుడు ట్యాంకు కూలిపోతుందోనని సమీపంలోని ఇళ్లలో ఉండేవారు భయాందోళనకు గురవుతున్నారు. చెన్నారంలో కొన్ని వీధిలైట్లు వెలగడం లేదని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా రేవల్లి మండలంలోని పలు గ్రామాల్లో సైతం సమస్యలు ఉన్నాయని, అధికారులకు చెబితే పట్టించుకునే నాథుడు లేకుండా పోయారని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గోపాల్‌పేటలో పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

వీధిదీపాలు వేయడం లేదు



రాంనగర్ కాలనీలో రెండు నెలలుగా స్తంభాలకు లైట్లు వెలగడం లేదు. ఎన్నిసార్లు అడిగినా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. ఎప్పుడు అడిగినా అప్పుడు ఇప్పుడు అని కాలయాపన చేస్తున్నారు. రోడ్లన్నీ చీకటిగా ఉండడంతో చిన్నపిల్లలు బయటకు పంపించాలన్నా భయంగా ఉంది. పాములు సంచరిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని లైట్లు వేయించాలి.

– నరసింహ, రాంనగర్ కాలనీ, గోపాల్‌పేట

సమస్యలు పరిష్కరిస్తాం



రాంనగర్ కాలనీలో లైట్లు వేశాం కానీ గాలులకు, ఇతర కారణాల వల్ల కొన్ని పాడై ఉండొచ్చు. ఆయా గ్రామాల కార్యదర్శులతో మాట్లాడి లైట్లు ఎక్కడెక్కడ లేవో పరిశీలించి లైట్లు బిగిస్తాం. డ్రెయినేజీ సమస్య ఎక్కడా లేదు. సంబంధిత అధికారులు గ్రామాల్లో నిరంతరం పర్యటించాలని సూచిస్తాం. ఏదుట్ల సమస్యను వేగంగా పరిష్కరిస్తాం.

– శంకర్‌నాయక్, ఎంపీడీఓ, గోపాల్‌పేట

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి: జిల్లాలోని బీసీ డీవో (జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి) బీరం సుబ్బారెడ్డి చేసిన నిధుల దుర్వినియోగంపై ఆధారాలతో సహ ఫిర్యాదు చేసినా.. విచారణ చేసి చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు కాలయాపన చేస్తున్నారని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోతే త్వరలో కలెక్టరేట్ ముట్టడి చేస్తామన్నారు. వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ బ్యాంకు ఖాతాలో ఉండాల్సిన నిధులను ఉపయోగించుకోవడం, కార్పొరేషన్ నుంచి జిల్లాకు కేటాయించిన నిధులకు బ్యాంకు నుంచి అదనంగా వచ్చిన వడ్డీ డబ్బులను సైతం విత్ డ్రా చేసుకున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు స్పందించి వెంటనే విచారణ పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సాయికృష్ణ, రాకేష్, బీచుపల్లి, రవీందర్, వేణు గోపాల్, రాజారెడ్డి, చరణ్, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పవన్‌కుమార్

వెండి ముఖ కవచం బహూకరణ

గట్టు: మహాశివరాత్రి సందర్భంగా గట్టుకు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ చిన్న బస్వరాజు కుమారులు శివ సాయిప్రసాద్, ఉదయ్‌కుమార్‌లు శ్రీ వీరభద్రస్వామికి వెండి ముఖ కవచాన్ని బహూకరించారు. 60 తులాల వెండితో ప్రత్యేకంగా చేయించిన శ్రీవీరభద్రస్వామి ముఖ కవచాన్ని గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారికి వెండి ముఖ కవచాన్ని అలంకరించారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శివభక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.